## కేసీఆర్‌ను కలిసిన దిండిగాల


కేసీఆర్‌తో దిండిగాల రాజేందర్

ఇల్లెందు, మార్చి 12: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను పార్టీ వ్యవస్థాపక సభ్యుడు, ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షుడు దిండిగాల రాజేందర్ బుధవారం హైదరాబాద్‌లోని నందినగర్‌లో నివాసంలో కలిశారు. పార్టీ సభ్యత్వ నమోదు, వరంగల్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభ జయప్రదం చేయాలని దిండిగాలతో కేసీఆర్ అన్నారు.

## గిరిజన మహిళా సొసైటీ ఇసుక ర్యాంపులను పునః ప్రారంభించాలి


మాట్లాడుతున్న సోలం హరిశంకర్

మణుగూరు టౌన్, మార్చి 12: గిరిజన మహిళా సొసైటీ ఇసుక ర్యాంపులను పునః ప్రారంభించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మణుగూరు మండల అధ్యక్షుడు సోలం హరిశంకర్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీ ప్రజల ఉపాధిని దెబ్బకొట్టేందుకు ఇసుక ర్యాంపులను నిలిపి ప్రజాపాలకులు రైజింగ్ కాంట్రాక్టర్లతో బేరసారాలకు తెరలేపారని ఆరోపించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఆదివాసీ మహిళల అభివృద్ధికి సహకరించే విధంగా గిరిజన మహిళా ఇసుక సొసైటీలను పునః ప్రారంభించకపోతే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో మడి రమేష్, కంగాల ప్రవీణ్, గొగ్గెల కోటి, గణిబోయిన రాము, మడకం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పాలనలోనే బీసీలకు న్యాయం

దుమ్ముగూడెం, మార్చి 12: కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే బీసీలకు అన్ని విధాలా న్యాయం జరిగిందని దుమ్ముగూడెం మండల బీసీ సెల్ నాయకుడు కుమ్మరికుంట సూర్య యాదవ్ అన్నారు. దుమ్ముగూడెం మండలం తూరుబాక గ్రామంలో బుధవారం జరిగిన బీసీ సెల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో వెన్నుదన్నుగా నిలిచిన తెలంగాణ ఉద్యమ నేత ప్రొఫెసర్ దాసోజు శ్రావణ్‌కు ఎమ్మెల్సీ ఇవ్వడం శుభపరిణామమని అన్నారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతీయ అథ్లెటిక్స్ క్రీడాకారుడికి సన్మానం


క్రీడాకారుడిని సన్మానిస్తున్న దృశ్యం

మణుగూరు టౌన్, మార్చి 12: మణుగూరు నేతాజీ వాకర్స్ టీమ్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి అథ్లెటిక్స్ క్రీడాకారుడు, దుమ్ముగూడేనికి చెందిన అపక సతీష్‌ని సన్మానించారు. బెంగుళూరులో మార్చి 4 నుంచి 9వ తేదీ వరకు మాస్టర్స్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన రన్నింగ్ పోటీల్లో 100 మీటర్ల పరుగు పందెంలో పాల్గొని కాంస్య పతకం సాధించారు. కార్యక్రమంలో ఎన్.విజయభాస్కర్‌రెడ్డి, రావులపల్లి రాంమూర్తి, తాళ్లపల్లి యాదగిరి గౌడ్, సామ శ్రీనివాసరెడ్డి, వడ్డాణం రమేష్, జొన్నలగడ్డ వెంకటేశ్వరరావు, శంకర్‌రెడ్డి, వాగబోయిన నాగేశ్వరరావు, శంకర్, వంగా సంతోష్, కాపాంటి ప్రసాద్, కొరిమిల్ల శ్రీనివాస్, కనుకు రమేష్, ఆర్.సుమన్, రామిరెడ్డి, అలవాల రాంబాబు, అమర కిరణ్, రామకృష్ణ, బాబురావు, నవీన్ పాల్గొన్నారు.

## సాంస్కృతిక కళా రంగాల్లో మహిళలను ప్రోత్సహించాలి

భద్రాచలం, మార్చి 12: వివిధ రంగాల్లో రాణిస్తూ ప్రతిభ చూపిస్తున్న మహిళలను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు డి.సీతాలక్ష్మి అన్నారు. భద్రాచలంలో బుధవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన చైతన్య సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు, వివిధ రంగాల మహిళలు పాల్గొన్నారు.

## పాడి రైతులు అధిక దిగుబడి సాధించాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాజేందర్

బూర్గంపాడు, మార్చి 12: పాడి రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని అధిక దిగుబడి సాధించాలని వ్యాస్ ఏహెచ్ డా.రాజేందర్, ఐటీసీ బంగారు భవిష్యత్ ముఖ్య అధికారి జయప్రకాష్ తెలిపారు. బూర్గంపాడు మండలం మోరంపల్లిబంజర గ్రామంలో బుధవారం ఐటీసీ బంగారు భవిష్యత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మేలుజాతి దూడల ప్రదర్శన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఆధునిక పశు పోషణ విధానాలను అవలంబించడం ద్వారా రైతులు తమ ఆదాయాన్ని పెంచుకోవచ్చని, పాడి పరిశ్రమలో తాజా పద్ధతులను ఉపయోగించి రైతులు మరింత లాభదాయకమైన వ్యవసాయ విధానాలను అలవర్చుకోవాలన్నారు. ఈ మేలుజాతి దూడల ప్రదర్శనలో 75 మేలుజాతి ఆవులు, గేదెలు, దూడలను ప్రదర్శించారు. కార్యక్రమంలో టైఫ్ సంస్థ క్షేత్ర అధికారి సదయ్య, టెక్నీషియన్ వెంకటరామిరెడ్డి, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

## బోరు మోటర్ల చోరీ కేసులను ఛేదించిన పోలీసులు

మణుగూరు టౌన్, మార్చి 12: మణుగూరు మండలంలో 15 రోజులుగా వరుస బోరు మోటర్ల చోరీలకు పాల్పడుతున్న కేసును మణుగూరు పోలీసులు ఛేదించారు. ముత్యాలమ్మనగర్, మద్దులగూడెం, వాగు మల్లారం పరిసర ప్రాంతాల్లో కొత్తగా నిర్మితమవుతున్న ఇండ్లలో అక్కడ వేసిన బోర్ల నుంచి మోటర్లు చోరీకి గురయ్యాయి. మొదటగా వాగు మల్లారంలోని సతీష్ అనే యజమాని ఇంటి వద్ద నుంచి మోటర్‌ను తొలగించగా సదరు వ్యక్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మరో మూడు ఇండ్లలో కూడా ఇదే విధంగా బోరు మోటర్లు చోరీకి గురయ్యాయి. ఎస్సై ప్రసాద్, కానిస్టేబుల్ వీర రామారావు, షమీం ఒక ప్రత్యేక టీంగా ఏర్పడి సీసీ కెమెరాలు, కాల్ డేటా రికార్డు ఆధారంగా నిందితుల కోసం గాలించారు. బుధవారం ఉదయం నిందితులు నలుగురు రెండు బైక్‌లపై మోటర్లతో అమ్మడానికి వెళ్తుండగా రాజుపేట క్రాస్‌రోడ్ వద్ద వారిని పట్టుకున్నారు. వారిని విచారించగా మణుగూరులోని ముత్యాలమ్మ నగర్, వాగు మల్లారం, మద్దలగూడెంలో 15 రోజులుగా మోటర్లు చోరీ చేస్తున్నట్లు చెప్పారు. పట్టుబడిన వారిలో లంకమల్లారం గ్రామానికి చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషన్ రాయల రాజు, వాగుమల్లారం గ్రామానికి చెందిన పుట్ట సందీప్, అదే గ్రామానికి చెందిన పోలోజు నరసింహాచారి, పొడుదు దయాకర్ ఉన్నారు. వీరిని పట్టుకున్నందుకు సీఐ సతీష్‌కుమార్, ఎస్సై, సిబ్బందిని డీఎస్పీ రవీందర్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

# దవాఖానలో సమయం పాటించని సిబ్బంది?

## మందులు ఇచ్చే వారులేక గంటల తరబడి ఎదురుచూపులు

కరకగూడెం, మార్చి 12: మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో సిబ్బంది సమయానికి రాకపోవడంతో రోగులు వైద్యం, మందుల కోసం గంటల తరబడి నిరీక్షించాల్సిన దుస్థితి. దవాఖానకు వస్తే వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. బుధవారం ఉదయం 9 గంటలకు రావాల్సిన సిబ్బంది ఉదయం 11 గంటల సమయమైనా.. రాకపోవడంతో రోగులు పడిగాపులు కాశారు. కొన్ని నెలలుగా ఇదే తంతు ఇక్కడ జరుగుతుందని రోగులు చర్చించుకుంటున్నారు. ముఖ్యంగా మందులు( ఫార్మసిస్టు) అందించే గదిలో ఎవరూ ఉండరని,ఎప్పుడూ ఖాళీగానే దర్శనమిస్తుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వైద్యసిబ్బంది సమయాన్ని పాటించి సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


ఉదయం 11 గంటలకు మందుల గదిలో సిబ్బంది లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

### రెండు గంటల నుంచి ఎదురుచూస్తున్నాం



దవాఖానలో సిబ్బంది కోసం రెండు గంటల నుంచి ఎదురుచూస్తున్నా మందులు ఇచ్చేవారు లేరు. సమాధానం చేప్పేవారు లేరు. నీరసంగా ఉండి ఆరోగ్యం బాగుండకపోవడంతో రక్తపరీక్ష చేయించుకుందామని వచ్చాను. ఎవరూ లేకపోవడంతో ఎవరిని అడగాలో అర్థకావడం లేదు.

– దాట్ల సాంబశివరావు, దేవరనాగారం, కరకగూడెం మండలం

### ఫార్మసిస్ట్ గతంలోనే హెచ్చరించాం

ఫార్మసిస్ట్ గతంలో పలుమార్లు హెచ్చరించాం. ఇటీవల డీఎంహెచ్‌వో మెమోతో పాటు షోకాజ్ నోటీస్ అందజేశారు. సమయానికి మందులు రోగులకు అందడంలేదని మాకు ఫిర్యాదులు అందాయి. సమయం పాటించిన సిబ్బందిపై చర్యలు తీసుకుని ఉన్నతాధికారులకు రిపోర్టు చేస్తాం.

– డా.రవితేజ, పీహెచ్‌సీ వైద్యాధికారి

# తాగునీటి ఎద్దడి నివారించాలి


మాట్లాడుతున్న డిప్యూటీ సీఈవో చంద్రశేఖర్

ఇల్లెందు రూరల్, మార్చి 12: ఈ వేసవిలో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఈవో కె.చంద్రశేఖర్ ఆదేశించారు. తాగునీటి ఎద్దడి నివారణపై మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం సమీక్షా సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలన్నారు. ఎంపీడీవో ధన్‌సింగ్, ఎంపీవో చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ రూరల్, మార్చి 12: వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి ఆదేశించారు. వారితో ఆయన బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. బోర్లు, పైప్‌లైన్ల మరమ్మతులపై సమీక్షించారు. బోర్లు ఉన్న రైతులంతా నీటి నిల్వ కోసం ఫారం పాండ్‌లు నిర్మించుకునేలా చూడాలన్నారు. పంచాయతీల్లో ఎక్కువ మందికి ఉపాధి హామీ పనులు కల్పించేలా చర్యలు చేపట్టా సూచించారు.


చర్ల: వీరాపురంలో..


చర్ల: కందిపాడులో..

## మన్యంలో తాగునీటి కటకట

- పనిచేయని బోర్లు
- తాగునీటి కోసం గిరిజనుల వెతలు

చర్ల, మార్చి 12: మన్యంలోని అనేక గ్రామాల్లో వేసవి ఆరంభంలోనే తాగునీటి కోసం తహతహలాడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం, అధికారుల నిర్లక్ష్యం వల్ల బోర్లు పనిచేయడం లేదు. వాగులు, చెరువుల్లో నీరు అడుగంటిపోయాయి. రోజురోజుకి తాగునీటి కొరత తీవ్రతరం అవుతుంది. బోర్లు గంటల తరబడి కొట్టినా చుక్క నీరు రావడంలేదు. మండలంలోని క్రాంతిపురం, వీరాపురం, కందిపాడు, వెంకటచెర్వు పలు ఆదివాసీ గ్రామాల్లో నీటి ఎద్దడి నెలకొన్నది. కేసీఆర్ ప్రభుత్వం తాగునీటి సమస్య పరిష్కారం కోసం అమలుచేసిన మిషన్ భగీరథను కాంగ్రెస్ పాలకులు పట్టించుకోకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. మార్చిలోనే తాగునీటి సమస్య మొదలైతే మరో మూడు నెలల పాటు పరిస్థితి ఎలా ఉంటుందోనని మన్యం ప్రజలు ఆందోళన వ్యకం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

## సైబర్ మోసానికి గురైన మండల వాసి

పర్ణశాల, మార్చి 12: దుమ్ముగూడెం మండలం పర్ణశాల గ్రామానికి చెందిన ఎడారి మురళి అపరిచిత వ్యక్తి చేతిలో మోసపోయినట్లు బుధవారం సైబర్ క్రైంకు ఫిర్యాదు చేశారు. మురళి తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 11వ తేదీ తన మొబైల్‌కు ఎస్‌బీఐ బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నాం.. మీ నాన్నగారికి రావాల్సిన ఇన్సూరెన్స్ డబ్బులు ఎస్‌బీఐ బ్యాంకులో పడతాయి, ముందు రూ.2 వేలు తమ అకౌంట్‌లో పంపించాలని కోరారు. వెంటనే తన ఫోన్ ద్వారా రూ.2 వేలు ఫోన్ పే ద్వారా పంపించాడు. మరో అరగంట తర్వాత మీ నాన్న అకౌంట్‌లో రూ.18 వేలు పడుతున్నాయి, మా ఖర్చుల నిమిత్తం మరో రూ.2 వేలు ఖాతాకు బదిలీ చేయాల్సిందిగా కోరడంతో బాధితుడు వారి అకౌంట్‌కు రూ.2 వేలు పంపించాడు. వెంటనే ఎస్‌బీఐ లక్ష్మీనగరం బ్రాంచికి వెళ్లి అకౌంట్ చూడగా ఖాతాలో ఎటువంటి డబ్బులు పడకపోవడంతో తాను మోసపోయానని అర్థమై బ్యాంకు మేనేజర్‌కు జరిగిన విషయం తెలిపాడు. మా బ్యాంకు నుంచి మీకు ఎవరు ఫోన్ చేయలేదని బ్యాంకు అధికారులు తెలిపారు. దీంతో బాధితుడు ఆన్‌లైన్‌లో సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో పతకాల పంట

కొత్తగూడెం సింగరేణి, మార్చి 12: సింగరేణి కాలరీస్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలోని తొమ్మిది ఉన్నత పాఠశాలల్లో జనవరి 30న ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలంపియాడ్ జరిగింది. మొత్తం 533 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ నెల 10న ఫలితాలు వెలువడ్డాయి. కొత్తగూడెం సింగరేణి స్కూల్ నుంచి పరీక్ష రాసిన 114 మంది విద్యార్థుల్లో 20 మంది బంగారు పతకాలు సాధించారు. రూ.2వేల క్యాష్ అవార్డును ముగ్గురు అందుకున్నారు. మణుగూరు పాఠశాల నుంచి పరీక్ష రాసిన 84 మందిలో 13 మంది బంగారు పతకాలు సాధించారు. ఇల్లెందు పాఠశాల నుంచి 30 మంది, భూపాలపల్లి పాఠశాల నుంచి 52 మంది, గోదావరిఖని సెక్టార్–3 పాఠశాల నుంచి 70 మంది పరీక్ష రాశారు. వీరిలో ఎనిమిది బంగారు పతకాలు సాధించారు. గోదావరిఖని సెక్టార్–2 పాఠశాల నుంచి పరీక్ష రాసిన 34 మందిలో ఎనిమిదిమంది బంగారు పతకాలు సాధించారు.

## పాత నారాయణరావుపేటలో వైద్యశిబిరం

దుమ్ముగూడెం, మార్చి 12: దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పాత నారాయణరావుపేట గ్రామంలో వైద్యులు డాక్టర్ పుల్లారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 65 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. క్షయ నివారణ, సీజనల్ వ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సాగర్, ఎంఎల్‌హెచ్‌పీ సుప్రియ, హెల్త్ అసిస్టెంట్ చలపతి పాల్గొన్నారు.

## విజ్ఞానంతో పాటు మేధాశక్తిని పెంపొందించుకోవాలి

భద్రాచలం, మార్చి 12: గిరిజన సంక్షేమ శాఖ గురుకుల కళాశాలల్లో చదువుతున్న విద్యార్థినులు విజ్ఞానంతో పాటు మేధాశక్తిని పెంపొందించుకోవాలని గురుకుల డిగ్రీ కళాశాల సీనియర్ ఉపాధ్యాయురాలు, లైజన్ ఆఫీసర్ లక్ష్మి అన్నారు. స్టడీ టూర్‌లో భాగంగా విద్యార్థినులతో కలిసి బుధవారం ఐటీడీఏ కార్యాలయంలో విభాగాలు, మొబైల్ కోర్టు, గిరిజన మ్యూజియంను సందర్శించి అక్కడ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గిరిజన గ్రామాల్లో ఐటీడీఏ ద్వారా ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల గురించి ఆ శాఖలకు సంబంధించిన అధికారులు, విద్యార్థినులకు తెలియజేశారు. కార్యక్రమంలో ప్యాకల్టీలు అంజలి, నీలిమ, సింధు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వేతనాల పెంపునకు వినతి

ఇల్లెందు, మార్చి 12: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని కోరుతూ ఎమ్మెల్యే కోరం కనకయ్యకు ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. కొత్తపల్లి రఘు, శ్యామంత్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## లడ్డూ ప్రసాదాలు ప్రైవేటుగా విక్రయిస్తే చర్యలు

### దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి వెల్లడి

భద్రాచలం, మార్చి 12: భద్రాచలంలోని రామాలయం పరిసరాల్లో ఉండే వివిధ దుకాణాల వద్ద స్వామి వారి లడ్డూ ప్రసాదం పేరుతో ఎవరైనా లడ్డూ, పులిహోర భక్తులకు విక్రయించినట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటామని భద్రాచలం దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి పేర్కొన్నారు. ముఖ్యంగా శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల సమయంలో బయటి ప్రాంతాల నుంచి వచ్చిన వారు, స్థానిక వ్యాపారస్తులు ఇలాంటి చర్యలకు పాల్పడవద్దని కోరారు. దేవస్థానం దృష్టికి వస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని ఈవో హెచ్చరించారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

### ఏడూళ్ల బయ్యారం అటవీ క్షేత్రాధికారిణి తేజస్వి


అడవుల సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న ఎఫ్ఆర్‌వో తేజస్వి

కరకగూడెం, మార్చి 12: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని ఏడూళ్ల బయ్యారం అటవీ క్షేత్రాధికారిణి తేజస్వి అన్నారు. బుధవారం మండలంలోని రఘుపాథపాలెం గ్రామంలో ఆమె అటవీ అధికారులతో కలిసి అడవుల సంరక్షణపై గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అడవులను కాపాడుకుంటూ నూతనంగా పోడు కొట్టవద్దని, వన్య ప్రాణులను వేటాడవద్దని, అడవిలో నిప్పుపెట్టె వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అడవులు సమృద్ధిగా ఉంటేనే సకాలంలో వర్షాలు కురుస్తాయని, భూగర్భ జలాలు పెరుగుతాయని వివరించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ అధికారులు సూరయ్య, ఏడుకొండలు, రాందాస్, బీట్ అధికారులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ పోస్టులు వద్దని వినతి


జీఎంకు వినతిపత్రం ఇస్తున్న అధికారులు

రామవరం, మార్చి 12: చీఫ్ ఆఫ్ మెడికల్ సర్వీస్, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయవద్దని కోరుతూ ఏరియా జీఎం శాలెంరాజుకు అధికారుల సంఘం సభ్యులు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. అజ్మీరా శ్రీనివాస్, ఉపేంద్రబాబు, వైవీ రావు, రవీందర్, వెంకటేశ్వర్లు, శివకేశవరావు తదితరులు పాల్గొన్నారు.

## దుప్పి మాంసం స్వాధీనం

రామవరం, మార్చి 12: వన్య ప్రాణులను వేటాడి, వాటి మాంసాన్ని విక్రయిస్తున్న వ్యక్తిని అటవీ అధికారులు పట్టుకున్నారు. దుప్పి మాంసాన్ని స్వాధీనపర్చుకున్నారు. రామవరం ఎఫ్ఆర్‌వో శ్రీనివాస్ తెలిపిన వివరాలు.. చుంచుపల్లి మండలం పెనగడప గ్రామస్తుడు బుడగం శంకర్ ఇంట్లోని ఫ్రిజ్‌లో దుప్పి మాంసం నిల్వ చేశారని ఎఫ్‌డీవోకు సమాచారం అందింది. ఆయన ఆదేశాలతో బుడగం శంకర్ ఇంటికి మంగళవారం రాత్రి అటవీ సిబ్బంది వెళ్లారు. ఫ్రిజ్ నుంచి దుప్పి మాంసం స్వాధీనపర్చుకున్నారు. పంచనామా నిర్వహించేందుకు వెళ్లిన అటవీ సిబ్బందిని శంకర్, అతని కుటుంబీకులు బెదిరించారు. దీనిపై ఆ సిబ్బంది టూ టౌన్ పోలీసులకు సమాచారమిచ్చారు. బుడగం శంకర్‌ను అటవీ అధికారులు పట్టుకున్నారు. అతడిపై కేసు నమోదైంది.

## ఇంకుడు గుంతల్లో జిల్లాకు అగ్రస్థానం


ఇంకుడు గుంత తీయిస్తున్న కలెక్టర్

లక్ష్మీదేవిపల్లి, మార్చి 12: 'క్యాచ్ ద రైన్' పథకం అమలులో జిల్లాను దేశంలో అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యమని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మండలంలోని హమాలీ కాలనీలో ఇంకుడు గుంతను బుధవారం స్థానిక యువకులతో దగ్గరుండి తవ్వించారు. వారితో మాట్లాడారు. ఇంకుడు గుంతల ద్వారా వర్షపు నీటిని నిల్వ చేయవచ్చని అన్నారు. అదనపు కలెక్టర్ విద్యాచందన తదితరులు పాల్గొన్నారు.

## ఆటల్లోనూ రాణించాలి


విద్యార్థులతో ఆడుతున్న పీవో రాహుల్

ఇల్లెందు రూరల్, మార్చి 12: విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లోనూ రాణించాలని ఐటీడీవో పీవో రాహుల్ కోరారు. మండలంలోని బొజ్జాయిగూడెం పాఠశాలలో విద్యార్థులతో వాలీబాల్ ఆడారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లోనూ రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు.

## నేల, నీటి సంరక్షణపై అవగాహన



మాట్లాడుతున్న సుబ్బారావు

టేకులపల్లి, మార్చి 12: వర్షాధారిత ప్రాంతాల్లో నేల, నీటి సంరక్షణపై రైతులకు వాటర్ అండ్ ల్యాండ్ మేనేజ్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్ (హైదరాబాద్) బాధ్యులు అవగాహన కల్పించారు. మండలంలోని కోయగూడెం రైతు వేదికలో ఇల్లెందు ఏడీఏ లాల్‌చంద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సెంటర్ బాధ్యుడు సుబ్బారావు, కేవీకే కో–ఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీనారాయణమ్మ మాట్లాడారు. వర్షాధారిత ప్రాంతాల్లో నేల నీటి సంరక్షణ పద్ధతులు, నీటి కుంటల నిర్మాణం, వరి సాగులో నీటి ఆదా తదితర పద్ధతులపై అవగాహన కల్పించారు. పంటల మార్పిడి చేసుకోవాలని, వ్యవసాయ బోరు పక్కనే నీటి కుంట తవ్వితే నీటి లభ్యత పెరుగుతుందని సూచించారు.

## జీవ రాశులను రక్షించుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

అన్నపురెడ్డిపల్లి, మార్చి 12: తడి నేలల్లోని వృక్ష, జంతు జీవరాశులను రక్షించుకోవాలని ఎంఈవో ఆనంద్‌కుమార్ అన్నారు. మండలంలోని ఎర్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం 'రాష్ట్రీయ అన్వేష్కా సప్తాహ'లో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. గ్రామ శివారులోని చెరువును సందర్శించారు. ఎంఈవో మాట్లాడారు. తడి నేలల్లోని జీవరాశులపై అవగాహన కల్పించారు.

## లంబాడా కళాకారిణికి అవార్డు



అవార్డు అందుకుంటున్న నీల

టేకులపల్లి, మార్చి 12: మండలంలోని 9వ మైలు తండా గ్రామస్తురాలైన లంబాడా కళాకారిణి గుగులోత్ నీలకు 'ఉత్తమ కళాకారిణి' అవార్డును విజన్ నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ అందించింది. హైదరాబాద్ రవీంద్రభారతిలో బుధవారం 'విజన్' నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆమె ఈ అవార్డు అందుకున్నారు.

## ఆశ్రమం సందర్శన

అశ్వారావుపేట, మార్చి 12: మండలంలోని వినాయకపురం అనాథ పిల్లల ఆశ్రమాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి బుధవారం సందర్శించారు. అక్కడి సదుపాయాలను పరిశీలించారు. అనాళ పిల్లల సంరక్షణను సామాజిక బాధ్యతగా భావించాలని, ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నిర్వాహకులతో అన్నారు.

## సబ్ స్టేషన్ స్థలం పరిశీలన

టేకులపల్లి, మార్చి 12: మండలంలోని ముత్యాలంపాడు క్రాస్ రోడ్‌లో నూతన సబ్ స్టేషన్ ఏర్పాటుకు గుర్తించిన స్థలాన్ని విద్యుత్ శాఖ ఏఈ హెచ్.దేవ, సబ్ ఇన్‌స్పెక్టర్ ముత్యాల ప్రసాద్ బుధవారం పరిశీలించారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జూలూరుపాడు, మార్చి 12: మండలంలోని కాకర్ల గ్రామానికి సబ్ స్టేషన్ మంజూరైంది. గ్రామ సమీపంలోగల రైతు వేదిక ఎదురుగా ఉన్న ఎకరం ప్రభుత్వ స్థలంలో దీనిని ఏర్పాటు చేయనున్నారు. ఈ స్థలాన్ని బుధవారం విద్యుత్ శాఖ ఏస్ఈ మహీందర్, డీఈ రంగస్వామి, ఏడీ రవి, ఏఈ సతీష్ పరిశీలించారు.

## నిరుపేద కుటుంబానికి సాయం

ములకలపల్లి, మార్చి 12: మండలంలోని గంగిరెడ్డిపల్లి గ్రామస్తురాలు కోండ్రు వెంకటరమణ పది రోజుల కిందట అనారోగ్యంతో మృతిచెందింది. బుధవారం ఆమె దశదిన కర్మల కోసం ఆ నిరుపేద కుటుంబానికి బియ్యం, వంట సామగ్రిని ఆదివాసీ సంఘం నాయకుడు గడ్డం ఉదయ్ అందించారు.

## తాగునీటి సమస్యలపై సమీక్ష

పాల్వంచ రూరల్, మార్చి 12: వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి ఆదేశించారు. వారితో ఆయన బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. బోర్లు, పైప్‌లైన్ల మరమ్మతులపై సమీక్షించారు. బోర్లు ఉన్న రైతులంతా నీటి నిల్వ కోసం ఫారం పాండ్‌లు నిర్మించుకునేలా చూడాలన్నారు. పంచాయతీల్లో ఎక్కువ మందికి ఉపాధి హామీ పనులు కల్పించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

## 'దాసోజు'కు ఎమ్మెల్సీ టికెట్‌పై హర్షం

పాల్వంచ, మార్చి 12: తమ సామాజిక వర్గానికి చెందిన దాసోజు శ్రావణ్‌కుమార్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వడంపై విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. వారు బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మొగులోజు సీతారామాచారి (పట్టణ అధ్యక్షుడు), కాపర్తి వెంకటాచారి, కాసర్ల రామారావు, నాంపల్లి వేణుగోపాల్, కటుకోజ్వల సత్యనారాయణ, బసవపాత్రుని తిరుపతి తదితరులు పాల్గొన్నారు.